# ప్రజాశక్తి

సోమవారం 26 ఆగస్టు 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

ఎసెన్షియా యాజమాన్యాన్ని

# అరెస్టు చేయాల్సిందే..

◆ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ◆ ఫార్మా మృతుల కుటుంబాలకు పరామర్శ




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

**ప్రజాశక్తి - అచ్యుతాపురం, రాంబిల్లి**

కార్మికుల మృతికి కారణమైన ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేసేంత వరకూ పోరాటం కొనసాగుతుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు స్పష్టం చేశారు. ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబీకులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఎస్ఇజెడ్ కాలనీ మోటూరు పాలెం గ్రామానికి చెందిన మృతుడు పూడి దుర్గాప్రసాద్ ఇంటికి నర్సింగరావు వెళ్లారు. అతని తల్లిదండ్రులు పూడి సన్యాసిరావు, శ్యామల, అన్నయ్య పూడి నానిబాబు, చెల్లి జ్యోతిలను పరామర్శించారు. అలాగే వాసెట్టిపాలెం గ్రామానికి చెందిన మృతుడు ఎల్లబెల్లి చిన్నారావు ఇంటికి వెళ్లి భార్య లోవమ్మ, పిల్లలు లక్ష్మి కోమలి, శశాంక, అన్నయ్య ప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన మృతుడు వేగి సన్యాసినాయుడు ఇంటికి వెళ్లి మృతుని భార్య అచ్చియ్యమ్మను, మిగతా 2లో..

### ప్రభుత్వ విధానాలు, కంపెనీ నిర్మాణ డిజైన్ లోపం వల్లే ప్రమాదం

**- సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం**

**అనకాపల్లి :** అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వ విధానాలే కారణమని తేటతెల్లమైందని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎసెన్షియా కంపెనీలో రియాక్టర్ పైపులైన్, నిర్మాణ డిజైన్‌లోనే ప్రధాన లోపమని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డిఐజి ప్రకటించారంటే ప్రభుత్వాలు కంపెనీల యాజమాన్యాల పట్ల ఎంత ఉదాసీనంగా వుంటున్నాయో అర్థమవుతోందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ మిగతా 2లో..

# ఉమ్మడి విశాఖలో 11 ఫ్లై ఓవర్‌లు

◆ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం

◆ రూ.1800 కోట్లు ఖర్చయ్యే అవకాశం

◆ కైలాసగిరిపై త్వరలో బిర్లా ప్లానటోరియం

◆ 'ప్రజాశక్తి'తో విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**






విశాఖపట్నం మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్ మెంట్ అథారిటీ ఉమ్మడి విశాఖ జిల్లాలోని విశాఖ, అనకాపల్లిల్లో 11 ఫ్లై ఓవర్‌లకు ప్రతిపాదనలను సిద్ధం చేయగా వాటికి కేంద్రం ఆమోదముద్ర వేసిందని విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. సుమారు రూ.1800 కోట్లతో ఈ ఫ్లై ఓవర్‌ల నిర్మాణం చేపట్టనున్నట్టు వెల్లడించారు. విశాఖ నగరంపై నానాటికీ పెరుగుతున్న జనాభా ఒత్తిడి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉపాధి కోసం ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున వలసలు రావడంతో రవాణా కనాకష్టంగా మారిందని, ఈ నేపథ్యంలో ఫ్లై ఓవర్‌లను నిర్మించడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడనున్నామని తెలిపారు. ప్రజా అవసరాలకు తగ్గ రహదారులను, ముఖ్యంగా ఫ్లై ఓవర్‌ల ద్వారా పరిష్కార మార్గాలను నిత్యం విఎంఆర్‌డిఎ అన్వేషిస్తుందని అన్నారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**ఫ్లై ఓవర్‌ల ప్రతిపాదనల గురించి తెలపండి ?**

పరదేశిపాలెం నుంచి గాజువాక వరకూ 10 ఫ్లై ఓవర్లను, అనకాపల్లి పరిధిలో ఒక ఫ్లైఓవర్‌ను వేసేందుకు ప్రణాళిక రచించాం. కేంద్ర ప్రభుత్వం వీటికి ఇటీవలే ఆమోదం తెలిపింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ) అధికారులు దీనిపై అధ్యయనం చేస్తున్నారు. త్వరలో కార్యరూపం దాల్చనున్నాయి.

**రాష్ట్ర ప్రభుత్వం ఫ్లై ఓవర్‌లపై ఎలాంటి విధానం తీసుకోనుంది?**

ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మిగతా 2లో..

## అలరించిన మీటూ పండిట్ సంగీత కచేరి

▶ వార్త 2లో..

## పాత పెన్షన్ పునరుద్ధరించాలి : యుటిఎఫ్

▶ వార్త 5లో..

## స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రతిఘటించండి

▶ వార్త 5లో..

# పలువురు ఐఎఎస్ అధికారుల బదిలీ

**నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా కల్పనశ్రీ**

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి 2019 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన అభిషేక్‌ను ఐటిడిఎ పాడేరు ప్రాజెక్టు అధికారిగా తిరిగి నియమించారు. అదేవిధంగా నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా 2022 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన కల్పన శ్రీని, అల్లూరి సీతారామరాజు జిల్లా సబ్ కలెక్టర్‌గా 2022 బ్యాచ్‌కు చెందిన శౌర్య మన్ పటేల్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం బదిలీలు పొందిన వారు సెప్టెంబర్ 9న రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు.

# లోకేష్ పర్యటనపై టిడిపి నేతల సమీక్ష

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్ర మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం విశాఖ వస్తున్న నేపథ్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం టిడిపి నాయకులు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ లోకేష్ వచ్చి వెళ్లే వరకు జరిగే కార్యక్రమాలను వివరించారు. సమీక్షా సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ దక్షిణ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం నాయకులు వెల్లంకి భరత్, మాజీ కార్పొరేటర్ ఆళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పుష్పాంజలి సాహు (ఫైల్‌ఫొటో)

ఐద్వా నాయకులు

## పుష్పాంజలి సాహు మృతి

పలువురు సంతాపం

▶ వార్త 4లో..




చెక్కు అందజేస్తున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

## 'లక్ పతి దీదీ' చెక్కుల పంపిణీ

ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు సత్కారం

వార్త 6లో..

## మొదటి పేజీ తరువాయి..

### అరెస్టు చేయాల్సిందే..

కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబీకులతో నర్సింగరావు మాట్లాడుతూ డబ్బు కన్నా ప్రాణం చాలా విలువైనదని అన్నారు. బాధిత కుటుంబీకులు మనోధైర్యంతో జీవనం సాగించాలని ధైర్యం చెప్పారు. పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగానే కార్మికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

అచ్యుతాపురంలోని ఓ కళాశాల ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలోనూ నర్సింగరావు మాట్లాడారు. ఫార్మా కంపెనీలపై ప్రభుత్వాల ఉదాసీన వైఖరిని ఎండగట్టారు. సెజ్‌లు ఆధునిక జైళ్లుగా మారాయన్నారు. బ్రాండిక్స్‌లో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్నా తక్కువ జీతాలే దక్కుతున్నాయని తెలిపారు. వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజాప్రతినిధులు హడావుడిగా వచ్చి వెళ్లిపోతున్నారు తప్ప శాశ్వత పరిష్కార మార్గాలు చూపడం లేదన్నారు. పరిశ్రమలకు కల్పించిన జిఒ నెంబర్ 62ను ఎత్తివేయాలని, సేఫ్టీ సోషల్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తూ ఈ నెల 28న జరిగే భారీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గానికి సిఐటియు అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు నాయకులు కె.సోమునాయుడు, దేవుడునాయుడు, సెజ్ నిర్వాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు బుద్ధ రంగారావు, రాంబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ విధానాలు, కంపెనీ నిర్మాణ డిజైన్ లోపం వల్లే ప్రమాదం

బిజినెస్ పేరుతో పరిశ్రమల తనిఖీ విభాగాల అధికారాలను బలహీనపర్చి యజమానుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు ఉండటమే ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఎసెన్షియా ఫార్మాలో నిర్మాణ డిజైన్ లోపం నుంచి భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వరకు ఉన్న లోపాలను సరిచేయాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా పరిశ్రమాధిపతుల లాభాపేక్ష కోసం పనిచేస్తోందని దుయ్యబట్టారు. కార్మికుల ప్రాణాలకు కనీసం విలువలేకుండా పోతోందని వాపోయారు. 2019 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 62 వల్ల ఎస్ఇజెడ్‌ల్లో తనిఖీలు లేకుండా పోయాయన్నారు. 2023 మార్చిలోనే ఎసెన్షియా కంపెనీలో పైపులైన్ బాగోలేదని పరిశ్రమల శాఖ అధికారులు యాజమాన్యానికి నోటీసు జారీ చేసి చర్యలు కోసం ప్రభుత్వానికి నివేదించినా చర్యలు కరువయ్యాని తెలిపారు. దాని దుష్ఫలితమే 17 మంది కార్మికుల మృతి అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీటన్నింటిని పున:పరిశీలించి కార్మికులు, ఉద్యోగుల ప్రాణాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఉమ్మడి విశాఖలో 11 ఫ్లై ఓవర్‌లు

విశాఖ మెడ్‌టెక్ జోన్‌కు విచ్చేసిన సందర్భంగా ఎయిర్ పోర్టు లాంజ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు. సిఎం ఆలోచన చూస్తే పై ఫ్లై ఓవర్‌లన్నిటినీ కలిపి ఒకే ఫ్లై ఓవర్‌గా విశాఖ నగరం వరకూ తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఫ్లై ఓవర్ పరిధిలోకి వచ్చే వివిధ ప్రధాన జంక్షన్ల వద్ద సర్వీసు రోడ్లు వచ్చేలా డిజైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

**11 ఫ్లై ఓవర్‌లు లేదా అన్నీ కలిపి ఒకే ఫ్లై ఓవర్‌లా తెచ్చేందుకు ప్రాజెక్టు ఖర్చు ఎంత ఉంటుందని అంచనా వేస్తున్నారు?**

సుమారు రూ.1800 కోట్లు అయ్యే అవకాశాలున్నాయి. జాతీయ రహదారి సంస్థతో కలసి విఎంఆర్‌డిఎ కొంత మేర డిపిఆర్‌ను తయారు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఒక విధానం ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాధ్యమైనంత తొందరలోనే ఫ్లై ఓవర్లు కార్యరూపం దాల్చనున్నాయి.

**ఇంకా విఎంఆర్‌డిఎ ఏయే కీలక ప్రాజెక్టులను చేపట్టబోతోంది ?**

గడిచిన కొంత కాలంగా నడుస్తున్న పలు ప్రాజెక్టులు ముందుకు సాగనున్నాయి. ఏ ప్రాజెక్టూ ఆగే పరిస్థితి లేదు. కొత్తగా కైలాసగిరిపై బిర్లా ప్లానటోరియం (సైన్స్ మ్యూజియం)కు విఎంఆర్‌డిఎ ప్రణాళిక తయారు చేసింది. ఇది ఆచరణ సాధ్యమయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నాం.

### కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** టిడిపి కూటమి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆ వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. 26 జిల్లాల పరిధిలో దాదాపు 2 లక్షలా 40 వేల మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఆ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఏడాదిగా నిలిచి పోయిందన్నారు. కొత్తగా వివాహమైన వారికి వివాహ ధ్రువపత్రం చూపిస్తే కార్డులు ఇస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రకటించినా ఉత్తర్వులు ఇంకా వెలువడలేదన్నారు. గత ఏడాది జూలై వరకు దరఖాస్తు ప్రక్రియ జరిగిందని, ఆ తరువాత ఆగి పోయిందని అన్నారు. కార్డుల్లో పేర్లు తదితర మార్పులకు అవకాశం ఇవ్వలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు అవకాశం ఉన్నంత మేరకు రేషన్ సరుకులను వారి చెంతకు చేర్చాలని కోరారు.

### హత్యాచార ఘటనపై నిరసన ర్యాలీ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ ప్రహ్లాదపురం వద్ద ఉన్న మోడీ స్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. ర్యాలీలో అసోసియేషన్‌లోని మహిళా సభ్యులంతా పాల్గొన్నారు.

# కార్మికుల ప్రాణాలకు వెల !

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

పరిశ్రమల ప్రమాదాలపై పాలకపక్షం, ప్రతిపక్షం స్పందిస్తున్న, మాట్లాడుతున్న తీరు ఆక్షేపణీయంగా వుంది. భవిష్యత్తులో ప్రమాదాలు నివారించాలన్న సదాలోచన ఏ మాత్రమూ కనబడ్డంలేదు. ప్రమాదం జరిగిన కంపెనీ ఆర్థిక పరిస్థితి, ప్రమాద సందర్భం, తీవ్రత ఆధారంగా పరిహారం పేరుతో మనిషి ప్రాణానికి వెల కట్టడం అదొక విలువగానూ, ధర్మంగానూ భావిస్తున్నాయి. ప్రమాదానికి కారణమైన యాజమానిపై చర్య తీసుకోవడానికి ఈ ప్రభుత్వాలకు ధైర్యం చాలకనో, తమవారిని నష్టపెట్టకూడదనోగానీ మనుషుల ప్రాణాలు బలితీసుకొనే యజమానులను తాకడానికి కూడా ఇష్టపడ్డంలేదు. న్యాయ సూత్రాల ప్రకారం మనిషిని చంపేవాడే కాదు.. చంపడానికి ప్రేరేపించే వాడు కూడా శిక్షార్హుడవుతాడు. పరిశ్రమల దగ్గరకొచ్చేసరికి ఈ మినహాయింపు యజమానులకు లభిస్తోంది. పొరపాటున జరిగిన ప్రమాదం కానప్పుడు, జాగ్రత్తలు తీసుకోక జరిగిన ప్రమాదమని స్పష్టంగా తెలిసినప్పుడు యజమానిని రక్షించాలనుకోవడం, వెనుకేసుకురావడం మనిషి, సమాజహితులెవరూ చేయరు. సమర్థించరు.

అసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో 17 మంది మృతికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని కార్మిక, ప్రజా సంఘాలో, నిపుణులో చెప్పడంలేదు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తరువాత జరిగిన మీడియా సమావేశంలో యాజమాన్యం నిర్లక్ష్యంతో ఈ ప్రమాదం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అయినా యాజమాన్యంపై చర్య తీసుకుంటారా ? అంటే ఉన్నత స్థాయి కమిటీని నియమించి, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తప్పించుకున్నారు. 17 మంది ఉద్యోగులు, కార్మికులను బలితీసుకున్న యజమాని పట్ల ముఖ్యమంత్రి ఇంత ఉదారంగా వుంటే, కార్మికులు, ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా ఎక్కడ వుంటుంది ?. నాడు ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొ




ప్పున పరిహారం ఇచ్చామని చెబుతున్న జగన్మోహన్‌రెడ్డి, నేడు అసెన్షియా ఫార్మా మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం ఇప్పించామని చెప్పుకుంటున్న చంద్రబాబు మాటల్లో ప్రమాద నివారణకు తీసుకోబోయే చర్యలు, భద్రత పాటించని యజమానులకు ప్రభుత్వపరంగా విధించబోయే శిక్షల గురించి ఎక్కడా కానరావడం లేదు.

కార్మికుల భద్రతపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు చంద్రబాబు మీడియా సమావేశంలో బదులిస్తూ పెట్టుబడులు, ఉపాధి, భద్రతకు సమ ప్రాధాన్యత ఇస్తామని బోధించారు. సిఎం మాటల్లో ఎవరికైనా ఒక ప్రశ్న ఉదయిస్తుంది. కార్మికుల ప్రాణాలకు భద్రతలేని పెట్టుబడులు, ఉపాధి ఎందుకు ?. హక్కుల కోణం నుంచి మాట్లాడితే మనిషికి జీవించే హక్కు, అవకాశం, భద్రత పరిశ్రమల్లో లేనప్పుడు పెట్టుబడులు ఎవరి కోసం ?. పనిచేసే ప్రదేశం, ప్రాంతంలో మనిషి బతకడానికి తొలుత భరోసా ఇవ్వాలన్న ఇంకితం కూడా ప్రభుత్వాలకు లేకపోవడం బాధాకరం. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ మానవ తప్పిదం వల్ల జరిగిందని తన (యజమానుల) తప్పిదాన్ని కప్పిపుచ్చుకొని కార్మికులపై నెట్టే ప్రయత్నం అటు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చేస్తూ వస్తున్నాయి. అసెన్షియా ప్రమాదంలోనూ, దీని తరువాత పరవాడ ఫార్మాలోని సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలోనూ ఆ మానవ తప్పిదం యాజమానులదేనని తేటతెల్లమైంది. ఎటువైపు నుంచి చూసినా ప్రతి ప్రమాదానికి యాజమాని భద్రతా వైఫల్యమో, తక్కువ జీతాలకు నైపుణ్యంలేని కార్మికులను పెట్టుకొని పనిచేయించడమో, రక్షణ పరికరాలు కార్మికులు, ఉద్యోగులకు ఇవ్వకపోవడమో, కంపెనీ డిజైన్‌లోనే లోపాలు ఉండడమో బయటపడుతూనే ఉన్నాయి. వాటిని సరిచేసే ప్రయత్నం ప్రభుత్వం నుంచి పటిష్టంగా లేకపోవడంతో ప్రమాదాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదాలు తగ్గాలంటే ప్రతి కంపెనీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి. ఆడిట్ నివేదికలోని అంశాలను నోటీసు బోర్డులో కార్మికులు, ఉద్యోగులందరికీ అర్థమయ్యే భాషల్లో ప్రదర్శించాలి. లోపాలను సరిచేయించే, సరిచేయకపోతే చర్యతీసుకొనే అధికారం సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఇవ్వాలి.

# అలరించిన మీటా పండిట్ సంగీత కచేరి




వినసొంపుగా సాగుతున్న కచేరి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి) వార్షికోత్సవ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. ఆరు రోజులపాటు జరిగే ఈ సంగీత వార్షిక ఉత్సవాల్లో రెండో రోజైన ఆదివారం ప్రదర్శించిన సంగీత కచేరి అలరించింది. హిందుస్థానీ గాత్ర సంగీత కచేరీలో దేశంలో ప్రసిద్ధిగాంచిన విధ్వంసురాలు మీటా పండిట్ తన శ్రావ్యమైన కచేరీతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. రెండో రోజు కార్యక్రమాలను విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రాత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలకు నిలయమైన విశాఖపట్నంలో కళాభారతి వేదికగా ఇటువంటి కార్యక్రమాలు జరగడం అభినందనీయమన్నారు. కళాభారతి యాజమాన్యం కళలను చేస్తున్న సేవ అద్భుతమని కొనియాడారు. కళలకు రాజధాని.. విశాఖ అని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 28న భూ బాధితుల సదస్సును జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** భూకబ్జాదారుల కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూముల లావాదేవీలన్నింటినీ రద్దు చెయ్యాలని, పేద ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఈ నెల 28న సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చెయ్యాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, జిఎస్‌జె.అచ్యుతరావు, ఎస్‌కె.రెహమాన్, సిఎన్.క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, ఎన్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### అంత్యక్రియలకు వాసుపల్లి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జైన్ చౌల్ట్రి మాజీ ఛైర్మన్, జిల్లా ఎస్‌సి సెల్ జనరల్ సెక్రటరీ కుందేటి సుధాకర్ తండ్రి కుందేటి మోహనరావు ఆదివారం అకాల మరణం చెందడంతో ఆయన అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మోహనరావు మృతి విషయం తెలుసుకున్న వెంటనే గణేష్ కుమార్ రంగిరీజు వీధిలో అంత్యక్రియలకు హాజరయ్యారు. మోహనరావు భౌతికకాయం వద్ద నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నింపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మాసి పోగురాజు పాల్గొన్నారు.

# ఉచిత ఇసుక.. మూన్నాళ్ళ ముచ్చట...



ఇసుక నిల్వలు లేక ఖాళీగా ఉన్న స్టాక్ పాయింట్

## నిల్వలు లేక మూతపడిన భీమిలి డిపో

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇసుక నిల్వలు లేకపోవడంతో జివిఎంసి మూడో వార్డు కృష్ణాకాలనీ వద్ద ఉన్న ఇసుక డిపో కొద్ది రోజుల కిందట మూత పడింది. ఉచిత ఇసుక సరఫరా మూన్నాళ్ళ ముచ్చటగా మారింది. ఇక్కడ నుంచి రోజుకు సుమారు 150 టన్నుల ఇసుక సరఫరా అయ్యేది. జులై 6న ఇక్కడి నుంచి ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియ ప్రారంభమైన విషయం విదితమే. టన్నుకు రూ.758 లు డిపో వద్దనే (స్టాక్ పాయింట్) చెల్లించి ఇసుక తీసుకెళ్లేవారు. చెల్లించిన ఈ మొత్తంలోనే కేంద్ర ప్రభుత్వం విధించిన జిఎస్‌టి, లోడింగ్, అప్ లోడింగ్, రవాణా చార్జీలు ఇమిడి ఉన్నాయి. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇదే డిపో నుంచి ఇసుక సరఫరా అయ్యేది. ఒక ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నుల ఇసుక పొందే వారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక విధానం అమలు చేసే నాటికి ఇక్కడి డిపోలో 94 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వ ఉండేది. శ్రీకాకుళం నుంచి ఇక్కడకు ఇసుక సరఫరా అయ్యేది. ఉచిత ఇసుక కోసం డిమాండ్ ఉండేది. ఇందుకోసం లారీలు పెద్ద ఎత్తున క్యూలో ఉండేవి. ఉచిత ఇసుక కోసం డిమాండ్ ఉన్న దృష్ట్యా ఇక్కడి స్టాక్ పాయింట్‌కు ఇసుక రప్పించి ఎప్పటిలాగానే సరఫరా చేస్తే బాగుండేదని పలువురు ఇసుక వినియోగదారులు అభిప్రాయ పడుతున్నారు. సులభతర రీతిలో ఇసుక సరఫరా చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. భీమిలి డిపో మూత పడడంతో ఇప్పుడు అగనంపూడి డిపో నుంచి మాత్రమే ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బోని గ్రామ సర్పంచ్ బోని అప్పలకొండ అన్నయ్య కరకాన శ్రీనివాసరావు (34) విజయనగరం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. చిన్నాపురం జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వేగంగా వస్తూ శనివారం రాత్రి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

బోని గ్రామానికి చెందిన కరకాన సీతారాం, రమణమ్మల కుమారుడు శ్రీనివాసరావు ఇటీవలే ఐసిఐసిఐ బ్యాంకులో ఉద్యోగం సంపాదించాడు. శ్రీను స్వతహాగా మృదు స్వభావి. స్వంతనిరంకారీ ట్రస్టులో సభ్యుడు. శ్రీనివాసరావుకు ఇద్దరు సోదరీమణులున్నారు. ఒక సోదరి అప్పలకొండ బోని గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ అప్పలకొండ భర్త సన్యాసినాయుడు బావమరిది అయిన కరకాల శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని తెలియడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీనివాసరావు భౌతికకాయాన్ని స్వంత నిరంకారీ ట్రస్ట్ సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు సందర్శించారు.

### నదిలో పడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ఉత్తరవాహిని నదీ తీరంలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి 9వ తరగతి విద్యార్థి మరణించిన విషాద ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. తారక్ అనే విద్యార్థి ఉత్తరవాహిని ప్రాంతం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమానికి వెళ్లాడు. భోజనం చేసిన తర్వాత నదీ తీరానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో నదిలో పడి మరణించినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వరహానదిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని పందూరు వరాహనది వద్ద ఆదివారం కాలిబాట వంతెన దాటుతూ వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. గొట్టువాడ గ్రామానికి చెందిన సుంకర పెదపోతురాజు (65) పొలం పనుల నిమిత్తం సైకిల్ పై పందూరు వంతెన వద్ద నది దాటి వెళుతుండగా అదుపుతప్పి నదిలో పడిపోయాడు. నదిలో జారిన వ్యక్తి ఒడ్డుకు చేరుకుని తిరిగి సైకిల్ కోసం నదిలోకి వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సైకిలు తీసుకొచ్చే క్రమంలో వ్యక్తి అలసిపోయి నదిలో మునిగిపోయి ఉండవచ్చునని స్థానికులు చెప్పారు. ఉదయం 7:30 ప్రాంతంలో జరిగిన ఘటన అనంతరం అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు. సాయంత్రం వరకు ఆచూకీ దొరకలేదు.గల్లంతైన వ్యక్తికి భార్య సూర్యకాంతం, కుమార్తె రాజేశ్వరి, కుమారుడు వెంకటేష్ ఉన్నారు. వ్యవసాయ ఆధారిత కూలి కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

### బస్‌షెల్టర్‌ను కూల్చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకటేశ్వర స్వామి ఆలయ ఆర్చ్ ఎదురుగా బిఎన్ రోడ్డు పక్కన ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించి ఆ స్థలాన్ని చదును చేయించిన సయ్యపురెడ్డి భాస్కరరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.పంచాయతీ అనుమతి లేకుండా జెసిబితో బస్‌షెల్టర్‌ను కూల్చేయడమే కాకుండా, ఆ ప్రదేశాన్ని చదును చేసినట్లు పంచాయతీ కార్యదర్శి లోవరాజు ఫిర్యాదు చేశారన్నారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

### వడ్డాది ఎస్‌సి కాలనీలో చోరీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది గ్రామపంచాయతీ పరిధిలో ఎస్‌సి కాలనీకి చెందిన కోరుకొండ నాగరాజు ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.70 వేల నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## వినాయక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మధురవాడ : శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవాల సందర్భంగా 7వ వార్డు పరిధి చంద్రంపాలెం గ్రామంలో 33 అడుగుల భారీ గణనాథుడు కొలువు తీరనున్నాడు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రంపాలెం గ్రామస్తులు పిళ్లా చంద్రశేఖర్, పిళ్లా శ్రీనివాసరావు, జగుపిల్లి నాని, భోగవిల్లి నాని, పిళ్లా వెంకటరమణ, పిళ్లా రాము, పిళ్లా వెంకటరమణ, పోతిన నాయుడుబాబు, పిళ్లా మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో ఆదివారం సాలూరుకు చెందిన పూర్ణిమ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. ముందుగా మహా గణపతిం మనసా స్మరామి, అఖిలాం ఓ స్వశి, ప్రణవాల యం పాం, హర హర మహాదేవ, నెమలికి నేర్పిన నడకలివి, భోశంభా, అయిగిరి నందిని, మొక్క జొన్న తోటలో తదితర గేయాలకు నృత్య ప్రదర్శనలిచ్చారు. చిన్నారులు పక్షిత, చిత్రి, దివ్యచంద్రి, మోత, సాయిశీశ్వర, గుణప్రియ, ఈషిత, సాయిరుతక చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.



ఎమ్మెల్సీ బొత్సను అభినందిస్తున్న వైసిపి నాయకులు

## ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు

ప్రజాశక్తి - ఆరిలోవ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను వైసిపి నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి పివి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు వానపల్లి ఈశ్వరరావు, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షులు పెంద్ర అప్పన్న, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కె.మోహనరావు బొత్సను సత్కరించిన వారిలో ఉన్నారు.

# ఇళ్ల మధ్య కోళ్ల ఫారాలు

## గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం పెద్దిపాలెం పంచాయతీ పరిధిలో ఇళ్ల మధ్య కోళ్ల ఫారాలు ఏర్పాటుచేయడంతో గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. నివాసాల మధ్య ఐఆర్ సత్యనారాయణతో పాటు మరికొంతమంది కోళ్ల ఫారాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన గుండు తిరుమలేష్, కూరాకుల ఆడప్ప, కూరాకుల చిన్నారావు, కూరాకుల అప్పలరాజు, సంజీవరావు బాబ్జి ఇళ్ల సమీపంలోనూ ఏర్పాటుచేసిన కోళ్ల ఫారాలతో ఈగలు, దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. మృతిచెందిన కోళ్లను సమీపంలో ఉన్న కూరాకుల కల్లాల్లో ఉన్న కొత్త చెరువులో పడేయడంతో కుక్కలు వాటిని పీక్కుంటూ గ్రామ పరిసరాలను కలుషితం చేస్తున్నాయి. దుర్వాసన వస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఈ కోళ్లఫారాలను వేరే చోటకు తరలించే చర్యలు చేపట్టాలని గుడిలోవ నీటి సంఘం మాజీ అధ్యక్షులు కూరాకుల వెంకటేష్ కోరారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతులుగా తీర్చిదిద్దిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976 నుంచి 1979 వరకు 8, 9, 10 తరగతులు చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న నాటి సరదాలు, మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వీరంతా కృతజ్ఞతగా ఉన్నత పాఠశాలకు ఓ మైక్ సెట్ బహూకరించారు. పేదరికంలో ఉన్న ముగ్గురు తోటి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున సాయం అందజేశారు. పూర్వ విద్యార్థుల్లో అనేక మంది వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డ వారు ఉన్నారు. ప్రముఖ రచయిత పి.రాజేంద్రప్రసాద్ వర్మ రచించిన "అందాల జాబిలి.. భీమిలి" పుస్తకాలను అతనే స్వయంగా పూర్వ విద్యార్థులకు అందజేశారు. విశ్రాంత హెచ్‌ఎం కె.సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.సూర్యప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం పి.రమణ, కశింకోట ఎండిఒ రవికుమార్, న్యాయవాది ఎం.చిన్నయ్యపాత్రుడు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద రోగికి సేవాస్ఫూర్తి వితరణ



రోగికి నిత్యవసర సరుకులు అందజేస్తున్న సేవాస్ఫూర్తి సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నిరుపేద రోగికి సేవాస్ఫూర్తి సహాయం అందించింది. చినగదిలి నేతాజీనగర్‌లో కొబ్బరికాయలు విక్రయించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తమ్మిన రామచంద్రరావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికి పరిమితమయ్యాడు. జీవనం కష్టమై, మందులకు కూడా ఇబ్బంది పడుతున్నాడు. రవీంద్రనగర్ కేంద్రంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవాస్ఫూర్తి స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు ఆదివారం ఈ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, రోగికి డైపర్స్ తదితరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు ఎమ్.పి.పాత్రుడు, సిహెచ్ పద్మాజీ, నానాజీ, వికె.రాజు, ఎ.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాలు పెంచుకునేందుకు 'టెక్లా' దోహదం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** సివిల్ ఇంజినీరింగ్‌లో నైపుణ్యం పెంచుకునేందుకు టెక్లా నిర్మాణాల వంటి కోర్సులు ఉపకరిస్తాయని డాక్టర్ లంకపల్లి కాలేజ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి చెప్పారు. కళాశాలలో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు సివిల్ ఇంజినీరింగ్ విభాగం వనహ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేటివ్ ల్యాబ్‌తో కలిసి నిర్వహించిన టెక్లా నిర్మాణాలు ఆడ్ ఆన్ కోర్స్ శనివారం ముగిశాయి. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ జిటి నాయుడు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి ప్రాక్టికల్ ట్రైనింగ్ అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనహ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేటివ్ ల్యాబ్స్ కోల్‌కత ప్రతినిధులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ట్రస్టు సభ్యులు

## డ్రగ్స్ నివారణకు అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి -గాజువాక :** పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్లా కార్తీక్ ఆధ్వర్యాన డ్రగ్స్ నివారణపై ఆదివారం పాత గాజువాకలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత గాజువాక నుంచి ప్రారంభమైన ర్యాలీ కణితి రోడ్డు, కొత్త గాజువాక మీదుగా కొనసాగింది. ఈపీడీసీఎల్ ఎస్ఇ జి.శ్యాంబాబు ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద మాట్లడుతూ, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.నవీన్‌రెడ్డి, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, బిఎస్ఎన్.మూర్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ఇపిడిసిఎల్ సిఎమ్‌డిని మర్యాదపూర్వకంగా కలిసిన రామకృష్ణప్రసాద్

## ఇపిడిసిఎల్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి- సీతమ్మధార :** ఇపిడిసిఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు రామకృష్ణప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. సంస్థ సిఎమ్‌డి ఇమ్మడి పృథ్వీతేజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇపిడిసిఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల వినియోగదారులు దీర్ఘకాలంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదులను నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 1912కి తెలియచేయవచ్చని తెలిపారు.

## జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి- సీతమ్మధార :** జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యాన 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నేత్ర వైద్యశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు అందరూ నేత్ర దానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ, నేత్రదానంపై అవగాహన కోసం 15 రోజులు జిల్లాలో వివిధ చోట్ల కార్యక్రమాలను నిర్వహించేలా యాక్షన్ ప్లాన్ వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎమ్ఓ డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రభుత్వ నేత్ర వైద్యశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐద్వా నాయకులు పుష్పాంజలి సాహు మృతి



పుష్పాంజలి సాహు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు పద్మనాభరాజు, జగ్గునాయుడు, గంగారావు, ఐద్వా నాయకులు పద్మ, ఈశ్వరమ్మ

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఐద్వా కంచరపాలెం జోన్ కార్యదర్శి, సిపిఎం జోన్ కమిటీ సభ్యులు ఎ.పుష్పాంజలి సాహు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలియడంతో కంచరపాలెం జోన్ సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఐద్వా తదితర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్పాంజలి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, సీనియర్ నాయకులు విఎస్.పద్మనాభరాజు ఆమె భౌతికకాయానికి పార్టీ జెండా కప్పి పూలదండ వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఐద్వా జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎస్.అప్పలరాజు, బుజ్జి, పి.రామారావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకట్రావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం సంతాపం తెలిపారు. భౌతికకాయన్ని సందర్శించిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, ఎన్.నరేంద్రకుమార్, బి.వెంకట్రావు, బి.రమణి, ఐద్వా జిల్లా నాయకులు జి.ప్రియాంక, ఆర్.వరలక్ష్మి, కె.కుమారి, బి.భారతి, ఎస్.విజయలక్ష్మి, జి.లక్ష్మి, ఆర్.విమల, ఐద్వా సీనియర్ నాయకులు ఆర్.భాగ్యలక్ష్మి, ఎం.సుజాత, ఎం.జయలక్ష్మి, సిహెచ్.కమల, కె.సంతోషం, కె.అనురాధ, బి.అనంతలక్ష్మి ఉన్నారు.

అనంతరం సిపిఎం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ అధ్యక్షతన పుష్పాంజలి సంతాపసభ నిరన్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పుష్పాంజలి సాహు 2006 సంవత్సరంలో ఐద్వాలో

### పలువురు సంతాపం

చేరారని, ఆమె అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని తెలిపారు. తరువాత ఐద్వా జోన్ అధ్యక్షులుగా ఎక్కువ కాలం పనిచేసారని, ప్రస్తుతం జోన్ కార్యదర్శిగా ఉన్నారని చెప్పారు. సిపిఎం జోన్ కమిటీ సభ్యులుగా ఎక్కువ కాలం నుంచి ఉన్నారని తెలిపారు. ప్రజలతో సంబంధాలు పెట్టుకొని ఆమె పనిచేసేవారన్నారు. ఆమె ఒడిశాకు చెందిన వారు కావడంతో తెలుగు మాట్లాడేందుకు కొంత ఇబ్బంది పడినా బాగా మాట్లాడేవారన్నారు. భర్త, పిల్లల్ని కూడా పార్టీ ఆర్గనైజేషన్‌లో పనిచేసే విధంగా కృషిచేశారని, కోడలిని కూడా తీసుకొచ్చే వారని తెలిపారు. క్రమశిక్షణ నిబద్ధత గల కార్యకర్త పుష్పాంజలి అన్నారు. బాలల సంఘాన్ని, డ్వాక్రా గ్రూపులను, మహిళా సంఘాన్ని, పార్టీని బలోపేతం చేసే విధంగా కంచరపాలెం జోన్‌లో అవిశ్రాంతంగా ఆమె కృషి చేశారని కొనియాడారు. ఆమెను కేన్సర్ మహమ్మారి ఆకస్మిక మరణానికి గురి చేసిందన్నారు. ఆమె లేని లోటు సిపిఎం, ప్రజా ఉద్యమాలకు, వారి కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం జోన్ నాయకులు ఒ.అప్పారావు, బి.సింహచలం, ఎం.ఈశ్వరరావు, ఒ.విజయ, ఎస్.శ్రావణ్, ఎస్.సోమేశ్వరరావు, తెలుగు రమణ పాల్గొన్నారు.

## ఆర్‌పి.రాజు, పుష్పాంజలి సాహులకు ఘన నివాళి

**విశాఖ కలెక్టరేట్ :** నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన నాయకులు ఆర్‌పి.రాజు, పుష్పాంజలి సాహు అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కొనియాడారు. సిపిఎం అక్కయ్యపాలెం జోన్ కన్వీనర్‌గా పనిచేసి అకాల మరణం పొందిన ఆర్‌పి.రాజు వర్ధంతి సభను, పార్టీ నాయకులు పుష్పాంజలి సాహు సంతాప సభను పార్టీ కంచరపాలెం జోన్ కమిటీ సభ్యులు ఒమ్మి అప్పారావు అధ్యక్షతన ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. తొలుత వారికి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ఆర్‌పి.రాజు అక్కయ్యపాలెం ప్రాంత ప్రజలకోసమే కాకుండా జిల్లాలో దళితులకు రక్షణగా నిలిచాడన్నారు. పుష్పాంజలి సాహూ ఒడిశా ప్రాంతం నుంచి వచ్చినా ఇక్కడి ప్రజలతో మమేకమై పనిచేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగిన పోరాటాల్లో వారు పాల్గొన్నారన్నారు. ప్రజలను నిత్యం చైతన్యం చేశారన్నారు. వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభకు ముందు ఆర్‌పి.రాజు చిత్రపటానికి కెఎం.కుమార్ మంగళం, పుష్పాంజలి చిత్రపటానికి పి.వి.రమణలు పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, పి.మణి, ఎం.రాంబాబు, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### కష్టజీవుల కోసం రాజు నిరంతర తపన

**సీతమ్మధార :** పేద ప్రజలు, కష్టజీవులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆర్‌పి.రాజు నిత్యం తపనపడేవారని వక్తలు చెప్పారు. స్థానిక ఎన్‌ఆర్.నగర్‌లో ఆర్‌పి.రాజు ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సిపిఎం మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ కుల దురహంకారానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జోన్ కార్యదర్శి రాజు, నాయకులు గౌరీష్, అప్పలరాజు, ప్రకాష్ రావు, లక్ష్మీపతి, వెంకన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




ఆర్‌పి.రాజు వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

## మల్లుదొర విగ్రహ ఏర్పాట్ల కమిటీ గౌరవాధ్యక్షులుగా పల్లా

**ప్రజాశక్తి - గాజువాక :** జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఏర్పాటు చేయదలచిన స్వాతంత్ర్య సమరయోధుడు, విశాఖపట్నం తొలి పార్లమెంటు సభ్యుడు గాం మల్లుదొర విగ్రహం ఏర్పాటుకు గౌరవాధ్యక్షులుగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కన్వీనర్‌గా జాతీయ సంఘం కార్యదర్శి శివంగి నాగేశ్వరరావు వ్యవహరిస్తారని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. వీరితోపాటు 18 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేస్తామని ప్రకటించారు. భానోజీతోటలోని విశాఖ అల్లూరి, గాంగంటం, మల్లు దొరల సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పడాల వీరభద్రరావు మాట్లాడుతూ, విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అంగీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్యక్షులు రాజాసాగి సత్యనారాయణరాజు, కార్యదర్శులు శివంగి నాగేశ్వరరావు, పల్లా భాస్కరమణి, కార్యవర్గ సభ్యులు ఆడారి నాగ సత్యనారాయణ, పోతిన వెంకటేశ్వరరావు, శుక్లా కామేశ్వరరావు, గుంటు చిట్టిబాబు, కంబాల నానాజీ, కంబాల భాస్కర్ పాల్గొన్నారు.

## 42 మంది రక్తదానం

**ప్రజాశక్తి-పెందుర్తి:** డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మండలంలోని ఎస్‌ఆర్.పురం గ్రామంలో సర్పంచ్ దూది విజయలక్ష్మి, నాయకులు వెంకటరమణ ఆధ్వర్యాన లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 42మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దూది వెంకటరమణ మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏటా ఎస్‌ఆర్.పురంలో ఏదో ఒక కార్యక్రమం చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొండపర్తివాసికి మహానంది పురస్కారం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** గత మూడు దశాబ్దాలుగా సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషికిగానూ దొండపర్తికి చెందిన 22/7 సొల్యూషన్స్ సీనియర్ ఇంజినీర్ కొండపి వెంకటగణేష్‌బాబును మహానంది పురస్కారంతో తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి, సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్ సంయుక్తంగా సత్కరించాయి. తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి, సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్ జాతీయ పురస్కార సన్మానసభ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అద్దంకి నాగేశ్వరరావు, రాజోలి పురేంద్రకుమార్ హాజరై కొండపి వెంకటగణేష్‌బాబును సత్కరించారు. అనంతరం గణేష్‌బాబు మాట్లాడుతూ, తన తల్లిదండ్రులు నేర్పిన సేవా దృక్పథం వల్లనే ఈ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డును తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు తానుపనిచేస్తున్న 22/7 సొల్యూషన్ సిబ్బందికి, మిత్రులకు అంకితమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు వల్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. అవార్డుకు తనను ఎంపిక చేసిన తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి, సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్ జాతీయ పురస్కార సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.




వెంకటగణేష్‌బాబు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

# పాత పెన్షన్ పునరుద్ధరించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి- అనకాపల్లి : కొత్త ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం ప్రవేశానికి ప్రకటన జారీ చేసిందని తెలిపారు. ఈ పథకం ద్వారా 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50శాతం పెన్షన్‌తో పాటు గ్రాట్యూటీ, డిఆర్ కూడా ఇవ్వనున్నారన్నారు. అయితే గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ పథకంలో 50శాతం పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, గ్రాట్యూటీ డిఆర్‌ల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. అయితే ఉద్యోగులు మాత్రం పాత పెన్షన్ పథకంలో ఉన్న ప్రయోజనాలను మాత్రమే కోరుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం ఉద్యోగుల చందాతో పనిలేని పాత పెన్షన్ అమలుకు ఆలోచన చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శేషుబాబు, సీనియర్ నాయకులు మాకిరెడ్డి రాజునాయుడు, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతి సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈనెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సెప్టెంబర్ 2న నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథావిధిగా సాగుతుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్‌ను కూడా రద్దు చేసినట్లు ఎస్‌పి దీపిక తెలిపారు. ఫిర్యాదుదారులు గమనించాలని సూచించారు.

## పాఠశాల పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయి చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జానకి

ప్రజాశక్తి-అనకాపల్లి : పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని స్కూల్ శానిటేషన్ యూనియన్ జిల్లా కమిటీ కార్యదర్శి జానకి డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు ఆఫీసులో స్కూల్ శానిటేషన్ కార్మికుల జిల్లా కమిటీ సమావేశంలో జానకి మాట్లాడుతూ మార్చి నెల నుండి తమకు వేతనాలు ఇవ్వలేదని, ఈ పథకంలో పనిచేస్తున్న తామంతా దీనిద్వారా వచ్చే వేతనాలపైనే ఆధారపడి బతుకుతున్నామన్నారు. వేతనాలు ఇవ్వకపోతే ఏం తిని బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల యాప్‌లను తీసుకొచ్చి మానసిక ఆవేదనకు గురి చేస్తున్నారని, బడుగు బలహీన వర్గాలకు చెందిన మమ్మల్ని రాజకీయంగా ఇబ్బందులకు గురిచేస్తూ, తొలగిస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ హైస్కూల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు అధిక పని ఒత్తిడికి గురి అవుతున్నారని, వెయ్యి మంది వరకు విద్యార్థులున్న పాఠశాలలు ఇద్దర్నీ లేక ముగ్గురిని పెట్టి పని మొత్తం చేయించడం దుర్మార్గమన్నారు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు కనీసం సెలవు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. పేద, ఒంటరి మహిళలు బతుకు తెరువులేక పాఠశాల పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని, అలాంటిది నెలలు తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో మనీ,జానకి, నీలవేణి, వరలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

## ఏసుబాబు, నాగభూషణంలకు 'గిడుగు' సాహిత్య సేవా పురస్కారం

● 29న విజయవాడలో నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రదానం

ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు, తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి స్మారక పురస్కారాలకు 2024 సంవత్సరానికి అనకాపల్లి జిల్లా నుంచి ఎఎంఎఎల్ కాలేజీ పూర్వ విద్యార్థి 'సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ' అధ్యక్షుడు లాలం ఏసుబాబు, సామాజిక సేవా కార్యకర్త, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఎంపికయ్యారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న విజయవాడ, బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అవార్డు ప్రదానం చేయనున్నారు. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో ఉత్తమ సామాజిక సేవలు అందిస్తున్న వారికి నవ్యాంధ్ర రచయితల సంఘం ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. 'సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ' ద్వారా అధ్యక్షుడు లాలం ఏసుబాబు రక్తదానం, నేత్రదానం, అన్నదానం, వృద్ధులకు అండగా నిలవడం, అంధ విద్యార్థులను చదివించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎస్తూ బ్లైండ్ స్టూడెంట్ ని చదివిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఈ అవార్డు కి ఎంపిక చేయడం జరిగిందని, అలాగే కళా సామాజిక రంగంలో సేవలు అందిస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 29న ఠాగూర్ స్మారక గ్రంథాలయం బందరురోడ్ విజయవాడ నందు నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో అందజేయడం జరుగుతుంది.



లాలం ఏసుబాబు



బల్ల నాగభూషణం

## బిందేశ్వరి ప్రసాద్‌కు ఘననివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : మండల కమిషన్ మాజీ చైర్మన్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, పార్లమెంటేరియన్ బాబూ బిందేశ్వరి ప్రసాద్ మండల్ 106వ జయంతిని సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఉల్లిపాయల శంకరయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లిలో నిర్వహించారు. బిందేశ్వరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు.ఇతర వెనుకబడిన కులాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బొట్టా చిన్ని యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బర్గం పైడిరాజు,ం జిల్లా అధ్యక్షులు చిన్న మూర్తి, పల్లా గోవిందా, చిదాన కృష్ణ, నరిసే చిరంజీవి, ప్రసాద్, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీమాంధ్ర బీసీ సంఘం నేతలు

## మహిళలకు ముగ్గుల పోటీలు



బహుమతులతో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో శ్రీకృష్ణ వేడుకలను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. యాదవ్ యూత్ సంఘం నాయకులు, పెద్దలు ఆధ్వర్యంలో జరిగిన ముగ్గులు పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొని రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు.టిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ పోటీల్లో మొదట బహుమతి ఇమ్మంది అనూష, రెండవ బహుమతి గనివాడ మహాలక్ష్మి, మూడవ బహుమతి బొబ్బర రమాదేవి, నాలుగో బహుమతి గోకాడ దేవి విజేతలుగా నిలిచారు. వీరికి మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎల్. సత్యనారాయణ,ఇ.సాగర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. 26న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉదయం పిడతల పోటీలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం స్వామి ఊరేగింపు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో గొర్లె సన్యాసినాయుడు (ఫాస్ట్ ఫుడ్) గుల్లపల్లి మురళి, యాదవ సంఘం నాయకులు ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, వార్డు మెంబర్ బంధం అప్పలరాజు, హై స్కూల్ కమిటీ చైర్మన్ వారాది దేముళ్ళ, చిల్డ్రన్ బాయ్స్ యూత్ పాల్గొన్నారు .

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



20 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-సబ్బవరం: ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో 2003-04 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులందరూ తమ అనుభవాలు, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. టెన్త్ క్లాస్ చదువుకుని 20 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా మళ్లీ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. బ్యాచ్‌లో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు సహాయపడాలని నిర్ణయించారు. ఇకనుంచి ప్రతిఏటా ఏదోఒక చోట మిత్రులంతా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవాలని ఏకాభిప్రాయంతో నిర్ణయించారు. ఈ సందర్భంగా అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించి మాస్టార్లు సూర్యచంద్రరావు, విష్ణు, జంగమయ్య, విజయలక్ష్మి, సుబ్రమణ్యంలను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్రి శ్రీనివాసరావు, నమ్మి నర్సింగరావు, దాడి జనార్ధన్, కొమ్మోజి సతీష్, పెన్న వెంకటేష్, గవర రవికుమార్, సారిపల్లి అప్పలనాయుడు, గవర బొజ్జన్న, గొంతిన అచ్చం నాయుడు, రాపర్తి అప్పలరాజు, శశికళ, పుష్ప, హారిక, పిల్లి శివ కుమార్, ఉల్లి అప్పారావు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రతిఘటించండి


● సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న



విద్యుత్ కనెక్షన్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లు ఇవే

ప్రజాశక్తి -దేవరాపల్లి : జిల్లాలోని వ్యవసాయ పంపు సెట్లకు,నివాస గృహాల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే, ఎక్కడికక్కడ ప్రజలు ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి, రాష్ట్రంలోని గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు. అదానీ, షిరిడిసాయి తదితర కంపెనీలకు స్మార్ట్‌మీటర్ల పంపిణీ కాంట్రాక్టులను కట్టబెట్టిందన్నారు. స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టుల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉండగాస్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించి, హైకోర్టులో పిటిషన్లు కూడా వేసిన తెలుగుదేశం, కూటమి పార్టీలు, ఇపుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. విశాఖపట్నంతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి ప్రభుత్వ కార్యాలయాల్లో భద్రపరచి ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా బిగిస్తున్నారన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు ముందుగా బిగించి, ఆతర్వాత నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు అధికార యంత్రాంగం సిద్ధం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ పంపు సెట్లకు మొదటి దశలో స్మార్ట్‌మీటర్లను బిగించడం ద్వారా క్రమంగా ఉచిత విద్యుత్తుకు ఎసరు పెట్టే ప్రమాదం తెస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజన వినియోగదారులకు నష్టపుచ్చే చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల అమరిక ద్వారా ఇపుడు సెల్‌ఫోన్లు, టీవీలను ముందస్తుగా రీఛార్జి చేసుకునే తరహాలోనే విద్యుత్ వినియోగానికి కూడా ముందస్తుగా రీఛార్జి చేయాల్సిన పరిస్థితులు కల్పించి, అదనపు భారం, ఇబ్బందులు కలిగించడమే కాకుండా,వీటిపై అదనపు చార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వాయిదాల పద్ధతి వేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అదాని కంపెనీకి టీటర్లు తయారీ కాంట్రాక్టు ఇచ్చి, కోట్ల రూపాయల ప్రజాధనం మీటర్ల పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా మాట తప్పి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగి పోయిందని స్పష్టంగా అర్థమౌతోందని విమర్శించారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్‌మీటర్లను బలవంతంగా రాష్ట్రాలపై తద్వారా వినియోగదారులపై రుద్దడం దారుణమని, దీన్ని వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. వినియోగదారులంతా దీనిపై అవగాహన కలిగి ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా సురేంద్ర జన్మదిన వేడుకలు



సురేంద్రను సత్కరిస్తున్న పీలా గోవింద, తదితరులు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** అనకాపల్లి పట్టణంలో తెలుగుదేశం పార్టీ బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర జన్మదిన వేడుకలు ఆదివారం ఆ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో సురేంద్ర ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, జనసేన నాయకులు భీమరశెట్టి రాంకీ, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, ఎలమంచిలి టిడిపి ఇంచార్జ్ ప్రగాఢ నాగేశ్వరరావు, మాడుగుల టిడిపి ఇంచార్జ్ పివిజి కుమార్, ప్రత్యేక అతిథిగా విచ్చేసిన చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాధరావు, కూటమి పార్టీ నాయకులు సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించారు. 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి విధేయుడుగా పనిచేస్తూ, పార్టీ కష్టసుఖాల్లో నేనున్నానంటూ నడిపించిన సురేంద్రకు, కూటమి ప్రభుత్వంలో మంచి పదవి రావాలని పలువురు ఆకాంక్షిస్తూ, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి పార్టీల రాష్ట్ర,

## 27న భరత్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నేతలు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** అనకాపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదిన వేడుకలు ఈనెల 27న స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ తెలిపారు. ఆదివారం దీనికి సంబంధించిన ఏర్పాట్లపై పార్టీ కార్యాలయంలో వైసిపి శ్రేణులతో చర్చించారు. భరత్ జన్మదినం సందర్భంగా పేదలకు వస్త్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలకా సత్యనారాయణ, వైసిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కడిమిశెట్టి సతీష్, నాయకులు గుండా రమేష్ గుప్తా, డి.జ్ఞానదీప్, గొల్లవిల్లి చిరంజీవి, కూండ్రం సత్తిబాబు, పేలూరి కళ్యాణ్, డిబివిపి.రాజు,పెంటకోట శ్రీను, కరణం శివ, పాలిక.కొండబాబు, నోట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమికి ఏర్పాట్లు పూర్తి

**ప్రజాశక్తి- కె.కోటపాడు:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా పిండ్రంగి, ఆర్‌వై అగ్రహారం, గుల్లేపల్లి, గరుగుబిల్లి గొండుపాలెం తదితర గ్రామాల్లో కృష్ణ ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలు కృష్ణ ఆలయాల్లో అన్నదానం నిర్వహించేందుకు యాదవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.


## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**ప్రజాశక్తి- కశింకోట :** మండలంలో పల్లపు సోమవారం గ్రామంలో సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్న సమరాధాన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు వచ్చి, సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనువాసరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# 'లక్ పతి దీదీ' చెక్కుల పంపిణీ

- ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు సత్కారం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగపరచుకొని, వారి జీవనోపాధిని మెరుగు పరచుకొని లక్‌పతి దీదీ (లక్షాధికారులు)గా ఎదగాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. లక్‌పతి దీదీ దేశ వ్యాప్త కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ విసి హాలులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఆర్థికంగా ఉత్తమ లక్ష్యాలను సాధించిన సభ్యులను సత్కరించారు. ప్రశంసా పత్రాలు అందజేశారు. బ్యాంకు లింకేజీ ద్వారా 155 సంఘాల సహాయార్థం సమకూర్చిన రూ.14.26 కోట్ల విలువగల మెగా చెక్కును సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణపతి, ఎల్‌డిఎం శ్రీనివాస్, చేనేత, జౌళి శాఖ అధికారి పద్మలత, మైక్రో ఇరిగేషన్ పీడీ, పలువురు ఎపిఎంలు, ఏరియా కో ఆర్డినేటర్లు, సిఆర్‌పిలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో చెక్ అందజేస్తున్న డిఆర్‌ఒ దయానిధి

**అనకాపల్లి :** నిరుపేద మహిళలంతా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి దయానిధి పిలుపునిచ్చారు. ఆదివారం లక్ పతి దీదీ కార్యక్రమంలో భాగంగా మహిళలకు రుణం చెక్కును పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగపరచుకొని వారి జీవనోపాధి మెరుగుపరచుకొవాలని, ప్రతి మహిళ లక్షాధికారి కావాలని ఆకాంక్షించారు .మహారాష్ట్రలోని జల్గావ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో 'లక్ పతి దీదీ' ప్రారంభ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వర్చ్యువల్ విధానంలో అనకాపల్లినుంచి డిఆర్‌ఒ బి. దయానిధి, డిఆర్‌డిఎ. పీడీ శచీదేవి, ఇతర అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తిలకించారు.

ఈ సందర్భంగా జిల్లాలోని ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఆర్థికంగా ఉత్తమ లక్ష్యాలను సాధించిన సభ్యులను డిఆర్‌ఓ, ఇతర అధికారులు సత్కరించి సర్టిఫికెట్లను అందజేశారు. 614 మంది స్వయం సహాయక సంఘ సభ్యులు గల 193 సంఘాల సహాయార్థం బ్యాంకు లింకేజి ద్వారా సమకూర్చిన రూ.2.11 కోట్ల విలువ గల మెగా చెక్కును సభ్యులకు అందజేశారు. జిల్లాలో మొత్తం 40,116 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ఉండగా 4,42,432 మంది సభ్యులు ఉన్నారని, జిల్లా నుంచి 67,863 మందిని గుర్తించామని డిఆర్‌డిఎ. పీడీ శచీదేవి తెలిపారు.

**బుచ్చయ్యపేట :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లక్‌పతి దీదీ పథకంలో భాగంగా ఆదివారం మండలంలోని వడ్డాది కొత్తూరు గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఉమాశంకర్ డ్వాక్రా గ్రూపునకు చెందిన గిడుతూరు కళ్యాణికి వ్యాపారం నిమిత్తం పిఎంఇజిపి కింద రూ.ఐదు లక్షల బ్యాంకు రుణం చెక్కును అందజేశారు. వుడ్ చెక్కుడుమిషన్ కొనుగోలుకు బుచ్చయ్యపేట మండల మహిళా సమాఖ్య ద్వారా రుణం మంజూరు చేసినట్లు ఎపిఎం వై.బాలరాజు తెలిపారు. లబ్ధిదారులకు డిఆర్‌డిఎ పీడీ లక్‌పతి దీదీ కింద రుణం చెక్‌లను అందజేసి సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వడ్డది కొత్తూరు గ్రామ సంఘ విఒఎ లక్ష్మిని సత్కరించినట్లు తెలిపారు.

# కస్తూర్బాలో కుక్కలు హల్‌చల్!

- గుంపులుగా సంచారంతో భయాందోళనలకు గురవుతున్న విద్యార్థినులు
- పలు గ్రామాల్లోనూ వీధి కుక్కల బెడదతో ప్రజల బెంబేలు

**ప్రజాశక్తి- వడ్డాది :** బుచ్చయ్య పేట మండలం వడ్డాది కస్తూర్బా పాఠశాలలలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పిల్లలు చదువుకునేటప్పుడు, రాత్రిపూట పడుకునేటప్పుడు ఆరుపులతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తరగతి గదుల నుంచి హాస్టల్‌లకు వెళ్లివచ్చే క్రమంలో అక్కడే తిష్టవేసి ఉన్న కుక్కల గుంపులను చూసి ఒంటరిగా వచ్చేందుకు విద్యార్థినులు భయపడుతున్నారు. 10 నుంచి 20 వరకు కుక్కలు గుంపుగా సంచరించడం, విద్యార్థినులను చూడగానే అపుడపుడు ఉరుముతూ మీదకు వచ్చే ప్రయత్నం చేస్తుండడంతో భయపడుతున్నారు. వాటిని తరమికొట్టేందుకు యత్నిస్తే మీదకు వస్తున్నాయని విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

బంగారుమెట్ట, ఎల్‌బిపి అగ్రహారం, వడ్డాది తదితర గ్రామాల్లోనూ వీధికుక్కలు హల్‌చల్ చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలతోపాటు ఒంటరిఆ మగాళ్లూ సైతం రావాలంటే భయపడే పరిస్థితులున్నాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కుక్కల గుంపుల దాడిలో ప్రజలు ప్రాణాలను కోల్పోతున్న ఘటనలను టీవీల్లోనూ, సోషల్‌మీడియాలోనూ వస్తున్న వార్తలు ప్రజలను మరింత భయకంపితులను చేస్తున్నాయి. ఇప్పటికైనా గ్రామపంచాతీయలుగానీ, సంబంధిత అధికారులుగానీ కుక్కల బెడదను నియంత్రించే చర్యలు చేపట్టాలని ్రపజలు కోరుతున్నారు.



వడ్డాది కస్తూర్బా పాఠశాలలో సంచరిస్తున్న కుక్కల గుంపు

## నేటి నుంచి క్రీడా పోటీలు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** ఈ నెల 29న మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా ప్రాధికారసంస్థ చైర్మన్, కలెక్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు వివిధ క్రీడలతో పాటు క్విజ్, వ్యాసరచన తదితర అంశాల్లో పోటీలతోపాటు పలు క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్‌వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు, కళాశాలలతో సంక్షేమ హాస్టల్స్‌లో మహిళ హాస్టల్స్‌తో పాటు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలలో మండల అభివృద్ధి అధికారులు ఆధ్వర్యంలో వాక్/రేస్, వాలీబాల్, హాకీ, మినీ ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, చెస్, బాక్సింగ్, జూడో, వెయిట్‌లిఫ్టింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్స్ అందజేస్తామనఆనరు. అలాగే వివిధ వేదికలపై ప్రతిభచూపిన క్రీడాకారులను, శిక్షకులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనేందుకు అర్హతలు, ఇతర వివరాలకు 9963177814 ఫోన్ నంబర్‌లో సంప్రదించొచ్చని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్‌వి. రమణ తెలిపారు.

## దత్తక్షేత్రంలో అయోధ్య రాముని కోదండం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జివిఎంసి విలీన గ్రామం సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో అయోధ్య బాలరామునికి సమర్పించేందుకు అయోధ్యవాసి, రామభక్తులు చల్లా శ్రీనివాసశాస్త్రి పాదయాత్రగా తీసుకెళుతున్న 14కిలోల వెండితో చేసిన కోదండం, బాణాలను ఆదివారం భక్తుల దర్శనానికి ఉంచారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, 84వ వార్డు కార్పొరేటర్ చినతల్లి నీలబాబు దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాముడి కోదండం, బాణం దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చింతామణి గణపతి ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఎం.ఆంజనేయ రాజు, స్థలదాత సిపి.రామారావు, ఎ. రవికుమార్ ట్రస్టీలు, ఇంద్ర లక్ష్మి, ఎం రుషికేష్, సీహెచ్. సోమయాజులు, ఎ.పద్మావతి, రవిచంద్ర, పీలా నాగ శ్రీను చేపట్టారు. కాగా శ్రీనివాసశాస్త్రి గతంలో అయోధ్య రామమందిరం శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సమయంలో వెండి ఇటుకలకు, బంగారు పూతపూసిన పాదుకలను ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్, ప్రధాని మోడీ ద్వారా రామ్‌లల్లా ట్రస్ట్‌కు అందజేశారు.

## విశాఖ మహిళా అటానమస్ కాలేజీలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం

**ప్రజాశక్తి- విశాఖపట్నం :** విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పిజి అటానమస్ కళాశాలలో ఉన్న పది పీజీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల తెలిపారు. ఎంఎ ఇంగ్లీష్, ఎకనామిక్స్, ఎంకాం కామర్స్, ఎంఎస్‌సి మాథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, బోటనీ, మైక్రోబయాలజీ, సైకాలజీ తదితర పీజీ కోర్సుల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులు https://pgcet-sche.aptonline.in/APPGCET ద్వారా వెబ్ ఆప్షన్‌లో అప్లై చేసుకోవచ్చునని సూచించారు. కాలేజ్ కోడ్ 21281తో సరిచూసుకుని, వెబ్‌ఆప్షన్ పెట్టుకోవచ్చునని, . మరిన్ని వివరాలకు 7780168423, 7032270810 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపల్ సూచించారు. విశాఖపట్నం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏటా అత్యధిక ఉత్తీర్ణతా శాతంతో పాటు, జాతీయ అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు, అధునాతన టెక్నాలజీతో విద్యాబోధన సాగిస్తూ, ఎక్స్‌ట్రా కర్రికులర్ యాక్టివిటీస్‌తో విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్ది, వారిని ప్రగతిపథం వైపునకు తీసుకెళ్లే విధంగా తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వపరంగా అన్ని విద్యాపథకాలు అర్హులకు వర్తిస్తాయన్నారు.

## ఆసుపత్రి సిబ్బంది వేతనాల చెల్లింపునకు సిద్ధం

**- జిల్లా ట్రెజరీ అధికారి ప్రసాద్ బాబు**

**ప్రజాశక్తి-పాడేరు:** పాడేరు సర్వజన ఆసుపత్రిలో గత ఐదు నెలలుగా జీతాలు లేకుండా ఇబ్బంది పడుతున్న సిబ్బంది సమస్య కొలిక్కి వచ్చింది. గత ఐదారు నెలలుగా జీతాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న జిజిహెచ్ సిబ్బంది శనివారం ఆసుపత్రి ఎదుట ధర్నా చేయడమే కాకుండా, ఒక నర్సింగ్ సిబ్బంది ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ వెంటనే స్పందించి, వైద్య విద్య రాష్ట్ర సంచాలకులు, ఖజానా శాఖ రాష్ట్ర సంచాలకులు, ఇతర ఉన్నతాధికారులతో చర్చించారు. తగు ఆదేశాలు జారీ చేయించడంతో సమస్య ఒక కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో ఏడుగురు రెగ్యులర్ సిబ్బందితో పాటు 49 మంది కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాల బిల్లులు జిల్లా ట్రెజరీ కార్యాలయానికి సమర్పించగా జిల్లా ఖజానాధికారి ఆర్ ప్రసాద్ బాబు వెంటనే స్పందించి ఐదు నెలల బిల్లులను ఒకేసారి ఆమోదింప చేశారు. దీంతో, ఈ 56 మందికి మిగిలిన అన్ని శాఖల మాదిరిగా సెప్టెంబర్ ఒకటవ తేదీన ఐదు నెలల జీతాలు వారి వారి ఖాతాలకు జమవుతాయి. జిజిహెచ్ లో ఔట్సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న మరో 39 మంది సిబ్బంది జీతాల బిల్లులను ఆసుపత్రి అధికారులు సమర్పించాల్సి ఉందని, ఆ బిల్లులు కూడా సమర్పించిన వెంటనే ఆమోదించడం జరుగుతుందని జిల్లా ఖజానాధికారి ప్రసాద్ బాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిజిహెచ్ రెగ్యులర్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది జిల్లా కలెక్టర్ కు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, ఆసుపత్రి మెడికల్ పర్యవేక్షకులకు జిల్లా ఖజానాధికారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# అన్నదాతల్లో చిగురించిన ఆశలు


## వరికి ఊపిరినిచ్చిన వర్షం



వరి నాట్లు వేస్తున్న కూలీలు, రైతులు

**ప్రజాశక్తి -నక్కపల్లి :**గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. వరి నాట్లు ఎండుతున్న సమయంలో వర్షం పడి పొలాల్లోకి నీరు వచ్చి చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎండుతున్న వరికి ఈ వర్షం ఊపిరి నిచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వర్షాభావ పరిస్థితులు అనుకూలించక పోవడంతో వరి నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. వాతావరణం అనుకూలించి ఉంటే జులై నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారానికల్లా వరి నాట్లు పూర్తయి ఉండేవి. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచే వరుణుడు ముఖం చాటేయడంతో వరి నాట్లు జోరందుకోలేదు.

మండలంలో వరి సాధారణ సాగు 4,400 ఎకరాలు కాగా ,ఇప్పటికి సుమారుగా 1,900 ఎకరాల్లో మాత్రమే రైతులు ఉడుపులు వేశారు. అడపా దడపా కురిసిన వర్షాలకు మండలంలో బంగారమ్మ పేట, గునుపూడి, అమలాపురం, నెల్లిపూడి, ఎన్.నరసాపురం, చందనాడ, చినదొడ్డిగల్లు, దోసల పాడు, ముకుందరాజుపేట, జానకయ్యపేట, దేవవరం, డొంకాడ, గొడిచెర్ల, గుల్లిపాడు, కాగిత, పెద దొడ్డిగల్లు, ఉద్దండపురం,ఉపమాక, వేంపాడు తదితర గ్రామాల్లో రైతులు అష్ట కష్టాలు పడి అరకొరగా వరి నాట్లు వేసారు.



వరి పొలాల్లో చేరిన వర్షపు నీరు

నక్కపల్లి మండలంలో వరి సాగు పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉంది. వర్షాలు సరిగ్గా పడక పోవడంతో ఎండ తీవ్రతకు వరి నారు, అక్కడక్కడ ఉడిసిన వరి చేలు ఎండిపోతున్నాయి. వర్షాలు ముఖం చాటేయడంతో ఉడుపులు వర్షాభావ పరిస్థితుల్లో సాగకపోవడం, వరి నారు అక్కడక్కడా ఎండిపోతు, ముదిరి పోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పై రైతులు ఆశలు సన్నగిల్లాయి. వరి ఉడిచిన నాటి నుండి బ్రతికించుకునేందుకు రైతులు నానా పాట్లు పడాల్సి పరిస్థితి ఏర్పడింది. తమ పొలాల్లో ఉన్న బావుల్లో మోటార్ల సహాయంతో వరి నాట్లకు నీరు పెట్టి రక్షించే ప్రయత్నం చేశారు. రైతులకు ఆది నుంచే మోయ లేనంతగా పెట్టుబడుల భారం ఎక్కువ కావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా కాలం అనుకూలించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాతావరణం అనుకూలించక పోవడంతో రైతులు వరి సాగుపై పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. అయితే అష్ట కష్టాలు పడి వేసిన వరి నాట్లు కళ్ళ ఎదుటే ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో వర్షం కురవడంతో రైతుల్లో కాస్త ఆశలు చిగురించాయి.



ఘటాలను మోస్తున్న ఎమ్మెల్యే బండారు

## ఘనంగా మోదకొండమ్మ పండగ

**ప్రజాశక్తి-చీడికాడ:**మండల కేంద్రంలో ఆదివారం గ్రామదేవత మోదకొండమ్మ తల్లి అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. నాయకులు, భక్తులు ఘటాలను ఊరేగించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు, మాజీ జెడ్పిటిసి పోతల రమణమ్మ, అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

## దేవవరంలో ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**మండలంలోని దేవవరం గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి ఎంతో ఉత్సాహంతో ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా మూడు రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



చదువుతున్న విద్యార్థులు

## గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

**ప్రజాశక్తి-గొలుగొండ:**స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నీతి కథలు చదివి వినిపించారు. అదే విధంగా దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివి వినిపించారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా



పట్టుబడిన ట్రాక్టర్

**ప్రజాశక్తి- కోటవురట్ల:**రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రవేశ పెట్టినప్పటి నుంచి మండలంలో ఏదో ఒక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరుగుతూనే ఉంది. పలుమార్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి జరిమానా విధించినా అక్రమ ఇసుక రవాణా నిత్య కృత్యంగా మారింది. ఆదివారం తెల్లవారు జామున రాజుపేట గ్రామం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీసులు పట్టుకొని స్టేషన్కు తరలించారు. శనివారం పట్టుబడ్డ రెండు ట్రాక్టర్లకు, ఆదివారం పట్టుబడ్డ ట్రాక్టర్కు సోమవారం జరిమానా విధిస్తానని స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు.

ప్రధానంగా టైరు బళ్ళు నుండి ట్రాక్టర్లకు డంపింగ్ చేయడంతో రెవెన్యూ, పోలీసు అధికారులకు తలనొప్పిగా తయారైంది. ట్రాక్టర్ల ద్వారా చేస్తున్న ఇసుక రవాణా రాజకీయ నాయకుల అండదండలతోనే నడుస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి, నది నుంచి తరలిస్తున్న ఇసుక కారణంగా స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాలకు సమీపంలో ఇసుకను తరలించుకుపోవడంతో సమీపంలోనే బోరు బావులు ఉండటంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.





బొర్రా గుహల వద్ద పర్యాటకులు

## పర్యాటక ప్రాంతాలు కిటకిట

**ప్రజాశక్తి- అనంతగిరి:**ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు ఆదివారం కిటకిటలాడాయి. ఆదివారం సెలవు దినం కావడంతో విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది పర్యాటకులు సందర్శించారు. దీంతో ఆ ప్రాంతమంతా జనాలతో కిటకటలాడింది. తాడిగుడ, చిటంపాడు, కటికి జలపాతాలు తిలకించారు. కుటుంబ సమేతంగా స్నానాలు చేసి కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు.అలాగే డమ్ముకు, సుంకరమెట, యూ పాయింట్, అనంతగిరి, బీసుపురం, సుంకరమెట్ట, కాఫీ ప్లాంటేషన్‌ను పర్యాటకులు సందర్శించారు. కాఫీ ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అరకు ,డుంబ్రిగూడ ప్రాంతాలను తిలకించారు.

## కళాశాల ప్రిన్సిపల్‌కు ఎస్ఎఫ్ఐ నేతల నివాళి

**ప్రజాశక్తి -నక్కపల్లి:**పాకరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రవి శంకర్ నాయక్ గుండెపోటుతో మృతి చెందడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు సంతాపం తెలియజేసారు. పాయకరావుపేట కాంప్లెక్స్ వద్ద ఆదివారం సాయంత్రం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ రవి శంకర్ నాయక్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అర్జున్ మాట్లాడుతూ, విద్యార్థుల పట్ల ఆయన ఎంతో ప్రేమానురాగాలతో మెలిగే వారిని కొనియాడారు. కళాశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన మృతి విద్యార్థి లోకానికి తీరని లోటు అని అన్నారు. ఆయన అకాల మృతి విద్యార్థులను ఎంతగానో కలిసి వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, రవి, బంగారు బాబు, పలువురు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు



మాట్లాడుతున్న సూర్యచంద్ర

## ఉపాధి హామీ గ్రామసభలు విజయవంతం

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**ఈ నెల 23న నిర్వహించిన నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభలు విజయవంతం అయ్యాయని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర తెలిపారు. ఆదివారం నర్సీపట్నంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13326 గ్రామ పంచాయతీలలో ఒకేసారి గ్రామ సభ నిర్వహించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండలం అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, జనసైనికులు పాల్గొన్నారు.

## గెజిటెడ్ హెచ్‌ఎంల కార్యవర్గం ఏర్పాటు

**ప్రజాశక్తి-పాడేరు:** గిరిజన సంక్షేమ శాఖ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక తలారి సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విజయనగరం, అనకాపల్లి జిల్లాల గిరిజన సంక్షేమ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు కర్రీ సూర్యనారాయణ, బావ రాజు అప్పారావు పర్యవేక్షణలో ఏకగ్రీవంగా నూతన కమిటీ ఏర్పడింది. నూతన గౌరవ అధ్యక్షులుగా ఎస్.పూర్ణచంద్రరావు, అధ్యక్షులుగా జీవివి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా టీ.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామరాజు పడాలి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.ప్రసాద్‌రావు, మహిళా అధ్యక్షురాలిగా కే.సుమిత్ర, కోశాధి కారులుగా పి.పండన్న, బాలరాజు నియమితులయ్యారు.

# కారిడార్ నిర్వాసితులను.. చట్ట ప్రకారం ఆదుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులను 2013 భూ సేకరణ చట్ట ప్రకారం అన్ని విధాలుగా ఆదుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలోని మూలపర్ర గ్రామంలో తుఫాన్ భవనంలో ఆదివారం మాజీ సర్పంచ్ భర్త, వైసిపి నాయకులు సూరకాసుల గోవిందు అధ్యక్షతన నిర్వాసితుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహ మూర్తి, చందనాడ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్,రైతు సంఘం నాయకులు తళ్ళ అప్పలస్వామి తదితర నాయకులు హాజరయ్యారు. నిర్వాసితుల సమస్యలపై చర్చించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం, ఆర్ఆర్ ప్యాకేజ్ చెల్లించి, ఇతర సమస్యలు పరిష్కరించే వరకు అధికారులు భూములు జోలికి రావద్దన్నారు. ముందుగా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇల్లులు కోల్పోతున్న వారికి 25 లక్షలు, భూములు తీసుకోవడంతో ఉపాధి కోల్పోతున్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి భూములు స్వాధీనం చేసుకునే సంవత్సరాన్ని కటాఫ్ తేదీగా పరిగణించి రూ.15 లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఇంకా పలు గ్రామాల్లో డీ పట్టా, సాగుదారుల సమస్యలు కూడా ఉన్నాయని ఆ సమస్యలను కూడా పరిష్కరించి పరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ గ్రామ సభలకు హాజరై నిర్వాసితులు, వివిధ వృత్తుదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు భూములు, ఇల్లులు త్యాగాలు చేసిన నిర్వాసితులను ఇబ్బందులకు గురి చేయకుండా, సమస్యలన్నింటిని పరిష్కరించిన తర్వాతే పనులు చేపట్టాలని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. పార్టీలకతీతంగా నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గొర్ల బాబూరావు, యలమంచిలి తాతబాబు, గంటా నరసింగరావు, మనబాల రాజేష్, వంకా కృష్ణ, సూరిబాబు రాజు, రావి ఈశ్వరరావు, రావి అప్పారావు, రాము, నగేష్, నిర్వాసితులు పాల్గొన్నారు .


అభివాదం చేస్తున్న పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు


పెన్సిల్ మొనపై బాల కృష్ణుడు

## పెన్సిల్‌పై బాల కృష్ణుని ప్రతిరూపం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ తన సూక్ష్మ కళతో పెన్సిల్ మొనపై బాల మురళీకృష్ణుని రూపం అద్భుతంగా తీర్చిదిద్దాడు. సోమవారం శ్రీ కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని చార్‌కోల్ పెన్సిల్ మొనపై 8 మి.మీ. పొడవు, 14 మి.మీ. వెడల్పుతో కృష్ణుని ప్రతి రూపాన్ని చెక్కి అందరిని అబ్బురపరిచాడు. ఇందుకోసం 5 గంటల సమయం పట్టిందని వెంకటేష్ తెలిపాడు. ప్రస్తుతం ఆయన ఉన్నత విద్యను అభ్యసిస్తూ యూఎస్‌లో ఉంటున్నారు.


బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

## చిన తీనార్లలో బోనాల పండగ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆగస్టు నెలలో గ్రామస్తులు బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై బోనాలను గ్రామంలో ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. బోనాల పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


మరుగుదొడ్డి చుట్టూ ఉన్న మొక్కలు

## మొక్కల మాటున మరుగుదొడ్లు

-భయాందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్డ వద్ద పిచ్చి తుప్పలు పేరుకు పోయాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన మరుగుదొడ్డు చుట్టూ విపరీతమైన తుప్పలు పెరిగిపోయి ఉండడంతో పాములు, దోమలు బెడద ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా పాఠశాలకు దూరంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యాయులు స్పందించి మరుగుదొడ్ల వద్ద పిచ్చి తుప్పలు తొలగించి, రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని ఆర్కిడ్‌పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కృష్ణుడు, గోపికలు వేషధారణలతో విద్యార్థులు సందడి చేయగా, ఉట్ల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ సంస్కృతి ఉట్టిపడేలా ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి స్వామినాయుడు, ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరావు, డీన్ శ్రీకాంత్, చంద్రకళ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆనందపురం :** ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం రోడ్డులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. డాక్టర్ నిష్క్రించిన భక్త దాస ఆధ్వర్యాన 108 మంది సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం నిర్వహించారు.


సబ్బవరంలోని ఆర్కిడ్ స్కూల్లో సందడి చేస్తున్న విద్యార్థులు


గ్రంథాలను అందజేస్తున్న కొండలరావు

## గ్రంథాలయానికి విలువైన గ్రంథాలు అందజేత

-సీనియర్ జర్నలిస్టు ఆదారి కొండలరావు వితరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:దక్షిణ నియోజక వర్గం అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై ఉన్న శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయంకు సీనియర్ జర్నలిస్ట్ ఆదారి కొండలరావు రూ.20 వేల విలువైన విద్య, వైజ్ఞానిక, ఆర్థిక,రాజకీయ, సామాజిక, సాహిత్య గ్రంథాలతో పాటు జర్నలిజానికి సంబంధించిన ఎన్నో విలువైన గ్రంథాలను విరాళంగా అందజేశారు. ఆదివారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆదారి కొండలరావు మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలన్నారు. గ్రంథాలయాల్లో పఠనంతో జ్ఞానం, విజ్ఞానం, పరిజ్ఞానం ఏర్పడుతుందన్నారు. గ్రంథాలయాలను కాపాడు కోవలసిన అవసరం సామాజిక వేత్తలు, ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట గౌరీ శంకర గ్రంథాలయం పాలకవర్గం పెద్దలు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు సోదర భావంతో మెలగాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ సమావేశంలో సిఐ హరి


సిఐను సత్కరిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-గొలుగొండ:పోలీసులు, జర్నలిస్టుల మధ్య సోదర భావం ఉండాలని నర్సీపట్నం రూరల్ సిఐ హరి అన్నారు. ఆదివారం గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నర్సీపట్నం ప్రెస్ క్లబ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరైన సిఐ మాట్లాడుతూ, పోలీసులు, జర్నలిస్టుల వృత్తి సవాళ్లతో కూడుకుందన్నారు. సమగ్ర సమాచారం, అధికారుల వివరణతో వార్తలు ప్రచురిస్తే ఎవరికీ ఇబ్బందులు ఉండవన్నారు.

యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు మహంతి నారాయణ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల గట్టిగా పోరాడుతున్న ఏకైక యూనియన్ ఫెడరేషన్ మాత్రమేనన్నారు. అనకాపల్లి జిల్లాలో అతి తక్కువ మంది సభ్యులతో ప్రారంభం అయిన ఫెడరేషన్ నేడు జిల్లాలో అతి పెద్ద యూనియన్‌గా అవతరించడం అభినందనీయమన్నారు.

విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ యూనియన్‌ను బలోపేతం చేయడమే కాకుండా అనేక జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుండటం అభినందనీయమన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు మాట్లాడుతూ, వచ్చే నెల మొదటి వారంలో అనకాపల్లిలో జిల్లా మహాసభలు జరుగుతాయని, జిల్లా కార్యవర్గ ఎన్నికలు కూడా జరుగుతుందని, యూనియన్ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు తెలియజేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నర్సీపట్నం ప్రెస్ క్లబ్ కార్యదర్శి రాజు, గొలుగొండ ఎస్సై కృష్ణారావు, ఎల్లవరం సర్పంచ్ రాంబాబు, చీడిగుమ్మల ఎంపిటిసి అప్పలనాయుడు, చోద్యం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కొండలరావు, గొలుగొండ పాత్రి కేయులు బాబులు, మల్లేశ్వరరావు, సురేష్, శివ, మాణిక్యం, నాయుడు, నూకరాజుతో పాటు నర్సీపట్నం జర్నలిస్టులు భాదర్, శ్రీధర్, రమణ, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.